ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో సిద్ధరామాగౌడ్‌కు డాక్టరేట్

సిద్ధరామాగౌడ్‌కు డాక్టరేట్‌ను అందజేస్తున్న ప్రొఫెసర్లు

డిచ్‌పల్లి, జూన్ 24 : టీయూ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగం పరిశోధక విద్యార్థి బి. సిద్ధరామాగౌడ్.. డాక్టర్ వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'డిజైన్ ఆఫ్ నావెల్ ఇన్ ఎక్స్‌పెన్సివ్ మిక్స్‌డ్ మెటల్ యాక్సిడ్ బేసిడ్ నాన్ క్రిస్టలైన్ కాటలిస్ట్ ఫర్ ద సెలక్టివ్ కాటాలైటిక్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ ఆల్కాహాల్ అండ్ అల్టి రైట్స్ టు ఫైన్ కెమికల్' అంశంపై పరిశోధన చేశారు. సోమవారం నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా కాకతీయ విశ్వవిద్యాలయం – వరంగల్ నుంచి ఆచార్య రవీందర్ వడ్డె హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథంపై ప్రశ్నలు అడిగారు. పరిశోధకుడు ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలివ్వడంతో డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అధిపతి డాక్టర్ వాసం చంద్రశేఖర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, సైన్స్ డీన్ ఆరతి, కంట్రోలర్ అరుణ, డాక్టర్ బోయపాటి శిరీష, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కాంట్రాక్ట్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలూర్ వాసికి..

కల్లెం సుశాంత్

ఆలూర్, జూన్24: మండల కేంద్రానికి చెందిన కల్లెం సుశాంత్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సోమవారం ఐఐటీ ఖరగ్‌పూర్ పశ్చిమ బెంగాల్ యూనివర్సిటీలో సుశాంత్‌కు పీహెచ్‌డీని ప్రదానం చేశారు. ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ పర్యవేక్షణలో ఎఫెక్టివ్ వాటర్ మేనేజ్‌మెంట్ ఇన్ ఎ రిజర్వాయర్ రెగ్యూలేటెడ్ రివర్ బేసిన్ అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ఆయనను గ్రామస్తులు అభినందించారు.

సాగుచేస్తున్న భూములకు పట్టాలివ్వాలి

సిరికొండ ఎఫ్‌ఆర్వో కార్యాలయం ఎదుట నిరసన

సిరికొండలోని ఎఫ్‌ఆర్వో కార్యాలయం వద్ద సాగుదారులు, నాయకులు

సిరికొండ, జూన్ 24 : మండలంలోని తూంపల్లి, గడ్కోల్, సిరికొండ, మైలారం గ్రామాల్లోని పేదలు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు పిట్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. సాగు చేసుకుంటున్న వారు సోమవారం ఎఫ్‌ఆర్వో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు పట్టాలు ఇచ్చి, తన హామీని నెరవేర్చుకోవాలని అన్నారు. సీఎల్‌డీపీ స్కీమ్‌ల ద్వారా అభివృద్ధి చేసిన భూముల్లో కూడా అధికారులు సాగుకు అడ్డుపడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయకార్యదర్శి రమేశ్, నాయకులు దామోదర్, సాయిరెడ్డి, బాబన్న, లింబాద్రి, కిశోర్, రమేశ్, బాల్‌రెడ్డి, ఎర్రన్న, సాయిలు, శ్రీకాంత్, శ్రీనివాస్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

పాటితండా వద్ద బ్రిడ్జి నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి/ సిరికొండ/ ఇందల్వాయి, జూన్ 24 : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో సోమవారం పర్యటించారు. ధర్పల్లి మండలం వాడి గ్రామంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను పరిశీలించి, ఆర్‌అండ్‌బీ డీఈ సుధీర్‌తో చర్చించారు. వర్షాకాలం ప్రారంభమైనందున పనులను వేగవంతం చేయాలని, నాణ్యతతో నిర్మాణం చేపట్టాలని సూచించారు. సిరికొండ మండలంలోని గడ్కోల్ వద్ద హైలెవల్ వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరిశీలించారు. వానలు ఎక్కువగా కురిసే అవకాశం ఉన్నందున బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. హుస్సేన్‌నగర్, సిరికొండ, మైలారం, రావుట్లలో పలు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఇందల్వాయి మండలంలోని పాటితండా వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట ఆయా మండలాల నాయకులు ఉన్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన చీఫ్ వార్డెన్

డిచ్‌పల్లి, జూన్ 24 : టీయూ రిజిస్ట్రార్ యాదగిరి ఆదేశానుసారం ఓల్డ్ బాయ్స్, న్యూబాయ్స్, గర్ల్స్ హాస్టళ్లను చీఫ్ వార్డెన్ మహేందర్ సోమవారం తనిఖీ చేశారు. హాస్టళ్లలో పని చేస్తున్న వర్కర్లు, మెస్ కమిటీ మెంబర్లతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. సరుకుల కోసం కొత్త దుకాణాదారుడిని నియమించారు. కిచెన్‌ను శుభ్రంగా ఉంచాలని సూచించారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఖలీల్‌వాడి, జూన్ 24 : హైదరాబాద్‌లో జూలై 7వ తేదీన నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' సభకు సంబంధించిన కరపత్రాలను జిల్లా అధ్యక్షుడు గుండారం మోహన్, రూరల్ ఇన్‌చార్జి రవీందర్ సోమవారం ఆవిష్కరించారు. నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

చెరువు తూము మరమ్మతులకు చేయూత

కోటగిరి, జూన్ 24 : మండలకేంద్రంలోని దామరచెరువు తూము మరమ్మతులకు కోటగిరికి చెందిన తేళ్ల రవి యువసేన చేయూతనందించింది. తూము సైడ్ వాల్ పరిస్థితి అధ్వానంగా మారి, నీరు లీకేజీ అవుతుందని రైతులు ఆర్డీవోతోపాటు ఇరిగేషన్ అధికారులకు కొన్ని నెలల క్రితం ఫిర్యాదు చేశారు. అధికారులు చెరువు తూముకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతుల కోరిక మేరకు తేళ్ల రవి యువసేన సోమవారం మరమ్మతులు చేయించింది. దీంతో యువసేన అధ్యక్షుడు రవికుమార్, సభ్యులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను మానుకోవాలి

ఖలీల్‌వాడి, జూన్ 24 : కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల ప్రైవేటీకరణను మానుకోవాలని సీపీఎం అఖిల భారత కమిటీ నాయకుడు బి.వెంకట్ అన్నారు. ఆయన జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణకు ఆయువుపట్టుగా ఉన్న సింగరేణిని నష్టాల బాటలోకి నెట్టడానికి, సింగరేణికి బొగ్గు గనులను కేటాయించకుండా ఓపెన్ టెండర్లలో సింగరేణి కూడా పాల్గొనాలని చెప్పడం ఉద్దేశపూర్వకంగా ప్రైవేటీకరణ చేసేందుకు ఆలోచించడమే అని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు సహజ వనరులను కట్టబెట్టడం సరికాదని, సింగరేణి ద్వారా ఉచిత విద్యుత్‌తోపాటు వేలాది మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లాభాల కోసం బొగ్గు గనుల ప్రైవేటీకరణ వేలాన్ని నిర్వహిస్తున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈనెల 28, 29వ తేదీల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చామని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశబాబు, జిల్లా కార్యదర్శి సభ్యుడు పెద్ది వెంకట్రాములు, జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

టీయూలో నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు

డిచ్‌పల్లి, జూన్ 24 : ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల ద్వారా ఏర్పడిన ఖాళీలను ప్రస్తుత డీఎస్సీలో జతచేయాలని డిమాండ్ చేస్తూ టీయూ గ్రంథాలయ ఆవరణలో అభ్యర్థులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులలో ఏర్పడిన ఖాళీలను ఈ డీఎస్సీకి జత చేసి, మెగా డీఎస్సీని ప్రకటించడంతోపాటు డీఎస్సీ పరీక్షలను వాయిదా వేసి.. ప్రిపరేషన్‌కు రెండు నెలల సమయం కేటాయించాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరం బీఈడీ, డీఈడీ పూర్తిచేసుకుంటున్న అభ్యర్థులకు సైతం డీఎస్సీ రాసే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు శ్రీనూనాయక్, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

చందూర్, జూన్ 24 : చందూర్ – గోవూర్ రోడ్డులో వాగు దాటిన తర్వాత మూలమలుపు వద్ద సోమవారం తెల్లవారుజామున రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్లు ముందర భాగాలు పూర్తిగా దెబ్బతినగా.. ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు పోలీసుల కథనం ప్రకారం.. చందూర్ గ్రామానికి చెందిన కొత్తోళ్ల శ్రీనివాస్ – జ్యోతి దంపతులు హైదరాబాద్ నుంచి చందూర్‌కు డ్రైవర్ లింగంగారి సంజీవ్‌తో కలిసి వెళ్తున్నారు. పిట్లం మండలం చిల్లర్గి గ్రామానికి చెందిన వారు ట్యాక్సీ కారులో నిజామాబాద్ వైపు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ కారులో ఉన్న కొత్తోళ్ల శ్రీనివాస్ భార్య జ్యోతి, డ్రైవర్ లింగంగారి సంజీవ్‌కు కాలు విరిగింది. ట్యాక్సీ కారులో ఉన్న ఒకరి తలకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సీఐ జయేశ్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని, ప్రమాద తీరును పరిశీలించారు. పోలీసులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. చందూర్‌కు చెందిన కొత్తోళ్ల శ్రీనివాస్ దంపతులు మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుతారన్న సమయంలో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలను విద్యార్థి సంఘాల నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దాడుల నుంచి పాఠశాలలను కాపాడాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కోరారు. ఈమేరకు ట్రస్మా ఆధ్వర్యంలో ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డికి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు జిల్లా వ్యాప్తంగా 80 పాఠశాలల నిర్వాహకులు ఓ హోటల్‌లో సమావేశమై తీర్మానం చేశారు. – ఖలీల్‌వాడి, జూన్ 24

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

వినాయక్‌నగర్, జూన్ 24 : నగరంలోని ఎల్లమ్మగుట్ట ఏరియా, పోలీస్‌లైన్ రోడ్డులో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా.. ఫోర్త్ టౌన్ ఎస్సై సంజీవ్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 45-50 ఏండ్ల మధ్య ఉంటుందని తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలేదని, సంబంధీకులు 87126-59840, 87126-59719 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇసుక టిప్పర్ల సీజ్

ఎడపల్లి, జూన్ 24: మండలంలోని జానకంపేట్ శివారులో అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను సోమవారం ఉదయం పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గర్భిణులకు అవగాహన సదస్సు

కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ నీతూకిరణ్, వైద్యులు తదితరులు

సుభాష్‌నగర్, జూన్ 24 : జిల్లాకేంద్రంలోని గంగాస్థాన్‌లో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు 'ఆర్యజనని' పేరుతో అవగాహన సదస్సును సోమవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా మేయర్ దండు నీతు కిరణ్ హాజరై మాట్లాడారు. చదువు, ఆధ్యాత్మిక సంస్కారం కలిగిన మాతృమూర్తులున్న ఇంటి నుంచి గొప్ప వ్యక్తులు జన్మిస్తారని అన్నారు. ఆర్యజనని పేరుతో రామకృష్ణమఠం – హైదరాబాద్ వారు ఉమ్మడి రాష్ట్రాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గైనకాలజిస్ట్, ఆర్యజనని సమన్వయ కర్త డాక్టర్ అనుపమరెడ్డి అవగాహన కల్పించారు. గర్భిణులు సులభంగా వేసే యోగాసనాలపై యోగాగురువు అనంతలక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్యజనని సమన్వయకర్తలు నిహారిక, సముద్రాల మాధురి, దశరథ్, నారాయణ, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు సాయిప్రసాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే తనిఖీ

ఏర్గట్ల, జూన్ 24: మండల కేంద్రంలో జీపీ సిబ్బంది నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నీటి సర్వేను ఏఈ స్వరాజ్ సోమవారం తనిఖీ చేశారు. ఏఈ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సర్వేలో కార్యదర్శి జాకీర్ పాల్గొన్నారు.

వోడీఎఫ్ గ్రామాల్లో ఇంటింటా సర్వే

రెంజల్, జూన్ 24: బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన లేని (వోడీఎఫ్) గ్రామాల్లో మంగళవారం నుంచి గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు ఇంటింటా సర్వే చేపడుతారని ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన లేని గ్రామాలను కేసీఆర్ ప్రభుత్వం గతంలో గుర్తించినట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో మరుగుదొడ్డి లేని ఇండ్లను గుర్తించేందుకు ఈనెల 25 నుంచి ఈనెలాఖరు వరకు సర్వే జరుగుతుందని పేర్కొన్నారు. ఇంటింటా చేపట్టే సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు.

డబుల్ బెడ్ రూం ఇండ్లు అందించాలి

శక్కర్‌నగర్, జూన్ 24: బోధన్ పట్టణంలో అర్హులైన నిరుపేదలకు డబుల్‌బెడ్ రూం ఇండ్లు అందించాలని కోరుతూ పలు వార్డులకు చెందిన ప్రజలు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. గతంలో బోధన్ శివారులో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇండ్ల పనులు పూర్తి చేయించి, అర్హులైన వారికి అందజేయాలని కోరారు.

ఎస్టీ మినీ గురుకులంలో ప్రవేశాలు

మాక్లూర్, జూన్24: మండలంలోని సింగంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ మినీ గురుకులం (బాలికల) ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని రీజినల్ కో–ఆర్డినేటర్ సంపత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో తరగతిలో 1, ఐదో తరగతిలో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న పిల్లల తల్లిదండ్రులు జూలై 1లోగా గురుకులంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. లాటరీ పద్ధతిన జూలై 2న కలెక్టర్ సమక్షంలోఎంపిక చేస్తారని తెలిపారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి

శక్కర్‌నగర్, జూన్ 24: బోధన్ నుంచి గతంలో నడిచిన రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం విద్యార్థి జేఏసీ నాయకులు రాకాసీపేట్ రైల్వేస్టేషన్‌లో స్టేషన్‌మాస్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. సంఘం నాయకులు శివకుమార్, జునైద్ అహ్మద్ ఖలీల్, మోసీన్, రాంచందర్ తదితరులు మాట్లాడారు. బోధన్ నుంచి పేద, మధ్య తరగతి ప్రజలకు సౌకర్యంగా ఉన్న బోధన్– మిర్జాపల్లి ప్యాసింజర్ రైలును, బోధన్– మహబూబ్ నగర్, బోధన్– కరీంనగర్ రైళ్లను పలు కారణాలు చెబుతూ రద్దు చేశారని అన్నారు. బోధన్ నుంచి హైదరాబాద్‌తో పాటు కామారెడ్డి వంటి పలు ప్రదేశాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉన్న రైళ్లను రద్దు చేశారని పేర్కొనారు. కొన్ని ఏండ్లు కొనసాగిన శక్కర్‌నగర్, ఎడపల్లి రైల్వేస్టేషన్లను రద్దు చేశారని అన్నారు. రద్దైన రైళ్లు, రైల్వే స్టేషన్ల పునరుద్ధరణకు కృషి చేస్తామని ఎన్నికలకు ముందు పలు పార్టీల నాయకులు హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. రైళ్లను పునరుద్ధరించకపోతే అందరి సమన్వయంతో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

బోధన్, జూన్ 24: బోధన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు నూతన జాతీయ విద్యావిధానంపై మూడు రోజుల శిక్షణా తరగతులను సోమవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రారంభించారు. బోధన్ సీడీపీవో జానకి మాట్లాడుతూ బోధన్ ప్రాజెక్ట్‌లో 331 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయని అన్నారు. ఈ కేంద్రాల టీచర్లకు నూతన జాతీయ విద్యావిధానం, పూర్వ ప్రాథమిక విద్యాప్రణాళిక, కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విడుదల చేసిన పాఠ్యప్రణాళిక (రివైజ్డ్ ప్రీ స్కూల్ ఎడ్యూకేషన్) పుస్తకాలు విడుదల చేసినట్లు తెలిపారు. బోధన మెలుకువలపై లెస్సన్ ప్లాన్ ఆధారంగా టీచర్లకు 9 బ్యాచులుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో శిక్షణ పొందిన ఆసియా, గంగాలత బోధన మెలుకువలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధికా రాథోడ్, సౌజన్య, గంగవేణి, మమత, వనజ పాల్గొన్నారు.

సామాజికసేవ, పరిశుభ్రత అలవర్చుకోవాలి

మోర్తాడ్, జూన్ 24: సమాజంలో ప్రతి ఒక్కరూ సామాజిక సేవ, పరిశుభ్రతను అలవర్చుకోవాలని క్రిభ్‌కో కంపెనీ ఏరియా మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా సేల్స్ ఆఫీసర్ లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలో సోమవారం క్రిభ్‌కో ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు శానిటేషన్ కాంపెయినింగ్‌లో భాగంగా అవగాహన సదస్సును నిర్వహించారు. రైతులకు డస్ట్‌బిన్లు, బ్లీచింగ్ పౌడర్‌ను అందించారు. అనంతరం ఏఈవో రమేశ్ భూసార పరీక్షల కోసం మట్టి నమూనా సేకరణ విధానాన్ని రైతులకు వివరించారు. వ్యవసాయ సహకారం సంఘం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రేగుంట దేవేందర్, సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

అమీనాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

మోర్తాడ్/వేల్పూర్, జూన్ 24: ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎంఈవో ఆంధ్రయ్య అన్నారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్థానికుడు పోతు అర్జున్ తన తండ్రి పోతు రాజేశ్వర్ జ్ఞాపకార్థం విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేశారు. ముఖ్య అతిథిగా ఎంఈవో హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవన్న, గిరిధర్, ఉపాధ్యాయులు సుమలత, కవిత, సంతోష్ పాల్గొన్నారు. వేల్పూర్ మండలంలోని అమీనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రశాంత్ అన్న యువసేన ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రశాంత్ అన్న యువసేన ప్రతినిధి రేగుల రాములు మాట్లాడుతూ గతంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కులసంఘాల సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించిన సందర్భంగా ఎమ్మెల్యేకు నోట్ పుస్తకాలను అందజేశారని పేర్కొన్నారు. వాటిని విద్యార్థులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మహిళా శక్తి' ద్వారా మహిళలకు ఉపాధి

బోధన్ రూరల్, జూన్ 24: బోధన్ పట్టణంలో సోమవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు రాబోయే ఐదేండ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఇప్పించి మహిళల అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. ఐకేపీ ఏపీఎం వినోద్‌కుమార్ మాట్లాడుతూ మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉన్న మహిళలకే ఈపథకం వర్తిస్తుందని, సంఘాల్లో లేనివారి కోసం కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా శక్తి పథకం కింద మండలానికి మూడు యూనిఫామ్ కుట్టు కేంద్రాలు, మీసేవా కేంద్రాలు, మహిళా క్యాంటీన్లు, సోలార్ విద్యుత్ యూనిట్లు, కొత్త షాపులు, గేదెలు, కోళ్ల పెంపకం వంటివి ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. జూలైలో గ్రామ సంఘాల జనరల్ బాడీలు సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. సమావేశంలో ఐకేపీ సీసీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **కరపత్రాల ఆవిష్కరణ -** ఆర్మూర్‌టౌన్, జూన్24: హైదరాబాద్‌లో జూలై 7వ తేదీన నిర్వహించనున్న దండోర రజతోత్సవ సభను మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మోతె భూమన్న కోరారు. పట్టణంలోని కమలాకర్ నెహ్రూ కాలనీలో రజతోత్సవ కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దేవన్న, కందుల రాములు, ఎల్లయ్య, ప్రభాకర్, మార్క్, రక్షణ, జాన్ తదితరులు పాల్గొన్నారు.
- **నేడు మండల సర్వసభ్య సమావేశం-** మాక్లూర్, జూన్24: మండల సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ మాస్త ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జైక్రాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించనున్న సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశం అనంతరం ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.
- **28న వారసంత వేలం-** నందిపేట్, జూన్ 24: డొంకేశ్వర్ వార సంత వేలం ఈనెల 28న 10:30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచిన వారు తైబజార్ (వారసంత)కు రూ.10 వేలు ఉదయం 10గంటల లోపు చెల్లించాలన్నారు. గతంలో బకాయిలున్న వారు వేలంలో పాల్గొనేదుకు అర్హులు కారని పేర్కొన్నారు.
- **సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం -** భీమ్‌గల్/బోధన్ రూరల్, జూన్ 24: రైతులకు రూ.రెండు లక్షల వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని మంత్రి మండలిలో నిర్ణయించడంతో హర్షం వ్యక్తం చేస్తూ భీమ్‌గల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. బోధన్ మండలంలోని పెంటకుర్దు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.
- **నేడు రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ-** మాక్లూర్, జూన్24: రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం ఆర్మూర్‌లోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారిణి పద్మ సోమవారం ఉదయం 10 గంటలకు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రితో రైతులు మాట్లాడే అవకాశం ఉందన్నారు. విత్తనాల ఎంపిక, వానాకాలం పంటలపై సూచనలు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.
- **పోస్టర్ల ఆవిష్కరణ -** భీమ్‌గల్, జూన్ 24: ఈనెల 30న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు సంబంధించిన పోస్టర్లను మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి అధ్యక్షతన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బి.భాస్కర్ నర్సయ్య, గంగానర్సయ్య, రాజులింగం, హన్మంతు పాల్గొన్నారు.
- **రేపు డీవీ కృష్ణ స్మారక స్తూపం ఆవిష్కరణ-** బోధన్ రూరల్/నవీపేట/డిచ్‌పల్లి, జూన్ 24: ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త డీవీ కృష్ణ రెండో వర్ధంతి సందర్భంగా ఈనెల 26న జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్డులో ఆయన స్మారక స్తూపం ఆవిష్కరించనున్నట్లు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు బండారు మల్లేశ్ తెలిపారు. సోమవారం సాలూరా మండలంలోని ఖాజాపూర్, హున్సా, తగ్గెల్లి గ్రామాల్లో పోస్టర్లను ఆవిష్కరించారు. స్మారక స్తూప ఆవిష్కరణకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇర్షాద్, పడాల శంకర్, సీహెచ్ గంగయ్య, రాజు, సంజీవ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు. డీవీ కృష్ణ స్తూపం ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా బోధన్ డివిజన్ కార్యదర్శి డి.రాజేశ్వర్ కోరారు. నవీపేట మండల కేంద్రంలో సభ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు హన్మాండ్లు, సాయినాథ్, రాజేందర్, రవి పాల్గొన్నారు. ప్రజాపంథా సిద్ధాంత రూపకర్త డీవీ కృష్ణ స్తూప ఆవిష్కరణ ఈనెల 26న నిర్వహించనున్నామని, కార్యక్రమానికి కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ కోరారు. డిచ్‌పల్లి మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీవీ కృష్ణ ఉద్యోగాన్ని వదిలి, విప్లవోద్యమ నిర్మాణానికి కృషిచేసిన ఆదర్శప్రాయుడన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలో స్తూపకావిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు వెంకన్న, మురళి, పీవైఎల్ నాయకుడు మోహన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS

★Wanted Teachers to Teach Telugu, Hindi, English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant, Little Heart High School, Namdevwada, Nzb. Nursery to X Std. Contact No. 8309582476

NTZ-324943

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రైవేట్ పాఠశాలల బస్సుల తనిఖీ.. నాలుగు సీజ్



ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

నందిపేట్, జూన్ 24: మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాల బస్సులను రవాణా శాఖ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న బస్సులను సీజ్ చేశారు. మండల కేంద్రానికి చెందిన నాలుగు ప్రైవేట్ స్కూల్ బస్సులను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి తెలిపారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

ఆర్మూర్‌టౌన్,జూన్24: పట్టణంలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సభ్యులు సోమవారం సౌండ్ సిస్టంను వితరణ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీడీజీ హన్మంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌కు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు గోపికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టంను దాత లింబాద్రి గౌడ్ అందజేసినట్లు పేర్కొన్నారు.

నేడు దివ్యాంగుల చలో హైదరాబాద్

శక్కర్‌నగర్, జూన్ 24: కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ దివ్యాంగుల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాతా సూర్యవంశీ తెలిపారు. సోమవారం బోధన్ పట్టణంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రాగానే దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ.6వేలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు అందిస్తామన్న రూ. 4వేలు వెంటనే అందించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా హామీని నెరవేర్చడం లేదని అన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు రావాలని కోరారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి

శక్కర్‌నగర్, జూన్ 24: బోధన్ పట్టణ శివారులోని చెక్కిక్యాంపు నుంచి పెంటాకుర్దు వెళ్లే రహదారిలో సోమవారం ఉదయం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బోధన్ పట్టణ సీఐ సంద్ర వీరయ్య కథనం మేరకు.. కోటగిరికి చెందిన రావుల రాములు (65) అతని భార్య మారమ్మ తమ పింఛన్ డబ్బుల కోసం కుమారుడు సాయిలుతో కలిసి ద్విచక్రవాహనం(మోపెడ్)పై కోటగిరికి వెళ్తున్నారు. ఎదురుగా చెక్కిక్యాంపునకు చెందిన రాజన్న అనే వ్యక్తి బైక్‌పై వస్తూ వారిని ఢీకొట్టాడు. రాములుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాజన్నకు కూడా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్త నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మోపెడ్‌పై ఉన్న మారమ్మ, ఆమె కుమారుడు సాయిలుకు కూడా గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

మోటర్లు కేబుల్ చోరీ

నవీపేట, జూన్ 24: మండలంలోని కోస్లీ గ్రామ శివారులోని భరత్‌నగర్ తండా శివారులో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు అలీసాగర్ కాల్వలో నుంచి ఏడు వ్యవసాయ మోటర్లు, కేబుల్స్ చోరీకి పాల్పడ్డారు. రైతులు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన మోటర్లు, కేబుల్ విలువ రూ. 1.50 లక్షల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతులు మౌలానా, ముప్వ నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.